క్లుప్తంగా

గౌరీదేవిగా రాజరాజేశ్వరి



మనుబోలు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మనుబోలు కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు బుధవారం గౌరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శ్రీనివాసులు ప్రత్యేకాలంకారం చేసి శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఉభయకర్తలుగా మందాటి ఈశ్వరయ్య, సుభాషిణి దంపతులు వ్యవహరించారు.

తమిళ జాలర్ల నుంచి కాపాడాలని వినతి



మత్స్యకారులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

ఇందుకూరుపేట : సముద్రంపై తమిళ జాలర్ల నుంచి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వారి నుంచి రక్షణ కల్పించాలని మండలంలోని మైపాడు మత్స్యకారులు కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌లకు విన్నవించుకున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం మైపాడు బీచ్‌కు వచ్చిన కలెక్టర్, ఎస్పీలకు వారు తమ గోడును వినిపించారు. తమిళ జాలర్లు గుంపుగా పెద్దపెద్ద బోట్లతో వచ్చి తమ మత్స్య సంపదను దోచుకొంటున్నారన్నారు. తమపై దాడులకు సైతం తెగబడుతున్నారన్నారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ మత్స్యశాఖ కార్యదర్శికి లేఖ రాసి ఉన్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం దృష్టిలో కూడా ఈ సమస్య ఉందన్నారు. త్వరగా దీనిని పరిష్కరిస్తామన్నారు.

నిమ్మ మార్కెట్ వెలవెల



నిమ్మ తోటలు

పొదలకూరు: భారీ వర్షాల కారణంగా పొదలకూరు ప్రభుత్వ నిమ్మ మార్కెట్‌కు తోటల నుంచి కాయల రాక తగ్గుముఖం పట్టింది. రైతులు తోటల్లోకి వెళ్లలేకపోతున్నారు. దీంతో యార్డుకు కాయలు తరలింపు గణనీయంగా తగ్గింది. ఇదే పరిస్థితి మరో మూడు రోజుల వరకు ఉంటుందని వ్యాపారులు వెల్లడించారు. యార్డుకు బుధవారం సెలవు కావడంతో కొంతవరకు అనుకూలించినా కాయలు రాకపోవడంతో కూలీలకు సైతం పని లేకుండాపోయింది. దీనికితోడు దసరా తర్వాత ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. కిలో రూ.50 నుంచి రూ.90 పలికిన కాయలు ప్రస్తుతం రూ.30 నుంచి రూ.60 మాత్రమే ధరలు పలుకుతున్నాయి. వర్షాలతో మార్కెట్ ఇంకా తగ్గే అవకాశం ఉంటుంది. ఇప్పుడు కురిసిన వర్షం వల్ల తోటలకు ఇబ్బంది ఉండదు. కొంత వరకు మేలు జరుగుతుంది. అయితే జడవాన వల్ల రైతులు చిత్తడిగా ఉన్న తోటల్లోకి వెళ్లి కాయలు కోయాలంటే సమస్యగా మారింది. ఫలితంగా యార్డుకు కాయలు తగ్గి మార్కెట్లో లభ్యమయ్యే పరిస్థితి ఉండదు.

గాలి వీస్తే అపార నష్టం



నిమ్మమార్కెట్ యార్డు

తీరం దాటే సమయంలో ఈదురుగాలులు వీస్తే నిమ్మతోటలకు అపార నష్టం వాటిల్లే అవకాశం ఉంటుంది. పొదలకూరు ప్రాంతంలో నిమ్మతోటలతో పాటు, జమాయిల్, సవక విస్తారంగా సాగు చేస్తున్నారు. ఒక్క నిమ్మతోటలే సుమారు 5 వేల ఎకరాల్లో సాగవుతున్నాయి. తుఫాన్ ప్రభావం వల్ల గాలులు వీస్తే కోలుకోలేని విధంగా నష్టం వాటిల్లే అకాశం ఉంటుంది. గతేడాది డిసెంబర్‌లో మిచాంగ్ తుఫాన్ వల్ల విపరీతమైన గాలులు వీచి నిమ్మతోటలకు అపారనష్టం వాటిల్లింది. దాని నుంచి కొందరు రైతులు ఇప్పటికీ కోలుకోలేదు.

దుప్పట్ల పంపిణీ

విడవలూరు : మండలంలోని చౌకచర్ల ఎస్టీ కాలనీలో 30 గిరిజన కుటుంబాలకు బైండింగ్ హోమ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బుధవారం బియ్యం, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వారికి గిరిజనులు కృతజ్ఞతలు తెలియజేశారు.



వెంకటాచలం: ఇసుక బస్తాలు వేస్తున్న దృశ్యం



ముత్తుకూరు: నేలటూరు పట్టపుపాళెంలో పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ



ఇందుకూరుపేట : మైపాడులో కసురు మీద ఉన్న సముద్రం

వీడని వర్షం.. స్తంభించిన జనజీవనం

కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాలను వానలు వీడలేదు. బుధవారం భారీ వర్షాలు కురిశాయి. దీంతో జనజీవనం స్తంభించింది. అనేక గ్రామాల్లో రోడ్లు చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరి జనం ఇక్కట్లు పడ్డారు. అక్కడి వారిని అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు.

- కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో వానలు
- పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- స్వల్పంగా కోతకు గురైన సర్వేపల్లి రిజర్వాయర్ కట్ట
- చెరువుల్లోకి చేరుతున్న నీరు



తోటపల్లిగూడూరు - నరుకూరు రహదారిపై ఇలా..



పొదలకూరు పట్టణ వీధుల్లో వర్షపునీరు

పొదలకూరు: మండలంలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగుతున్నాయి. ఆల్తుర్తి వద్ద తిప్పవాగు, నావూరు వద్ద పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పొదలకూరులో 103.2 మి.మీ వర్షపాతం నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. మరింత వర్షపాతం నమోదై నావూరు పెద్ద వాగు పొంగితే దగ్గరలోని గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతాయి. వాగును ఎస్సై హనీఫ్ పరిశీలించి ఎవరూ దాటేందుకు ప్రయత్నించొద్దని హెచ్చరించారు. ఆల్తుర్తి తిప్పవాగు మీదుగా రెండురోజుల నుంచి రాకపోకలు స్తంభించాయి. రెవెన్యూ, పోలీసులు అధికారులు రాకపోకలను అనుమతించడం లేదు. సూరాయపాళెం విఘ్నేశ్వరస్వామి దేవస్థానం వద్ద మెయిన్ రోడ్డుకు పెద్ద రంధ్రం ఏర్పడింది. భారీ వర్షానికి రోడ్డు కోసుకుపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు వెల్లడించారు. పట్టణంలోని వీధులు జలమయమయ్యాయి. గత ప్రభుత్వంలో పెద్దఎత్తున సైడ్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టడంతో చాలావరకు మేలు జరిగింది. వర్షపునీరు కొంతమేర కాలువల గుండా వెళుతోంది. లేకుంటే రోడ్లు జలమయమై వర్షాలు తగ్గేంత వరకు నీరు నిల్వ చేరేదని స్థానికులు చెబుతున్నారు. వరవ కాలువలున్న చెరువుల్లోకి నీరు చేరుతున్నట్టు రైతులు వెల్లడించారు. మరుపూరులో మూడు చెరువుల్లోకి రెండు నెలలకు సరిపడా నీరు చేరినట్టు తెలిపారు. మండలంలోని జలవనరుల శాఖ పర్యవేక్షణలో 54 చెరువులున్నాయి. భారీ వర్షాలకు దాదాపుగా అన్ని చెరువుల్లో 25 శాతం నీరు చేరినట్టు ఇరిగేషన్ ఏఈ అనిల్ కుమార్ వెల్లడించారు. తహసీల్దార్ శివకృష్ణ మండలంలో వీఆర్వోలతో సమీక్షించారు. అధికారులు, ఉద్యోగులు నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

కోతకు గురైన సర్వేపల్లి రిజర్వాయర్ కట్ట

వెంకటాచలం: భారీ వర్షాలతో మండలంలోని సర్వేపల్లి రిజర్వాయర్ కట్ట స్వల్పంగా కోతకు గురైంది. మూడు రోజుల నుంచి ఎడతెరిపిలేని వాన పడుతుండగా రిజర్వాయర్ 5వ నంబర్ తూము సమీపంలో కట్ట పైభాగంలో గ్రావెల్ కరిగి కోతకు గురైంది. ఈ విషయాన్ని గుర్తించిన ఇరిగేషన్ అధికారులు గ్రావెల్ తరలించి, ఇసుక బస్తాలు వేసి పటిష్ట పరిచారు. రిజర్వాయర్ కెపాసిటీ 1.740 టీఎంసీలు. ప్రస్తుతం 1.160 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

ముత్తుకూరు: భారీ వర్షాలు ముంచెత్తే అవకాశం ఉన్నందు వల్ల లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని నెల్లూరు ఆర్డీఓ నాగసంతోష అనూష తెలిపారు. మండలంలోని నేలటూరు పట్టపుపాళెంలో 35 కుటుంబాల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని బుధవారం ఆమె తహసీల్దార్ బాలకృష్ణారెడ్డితో కలిసి పరిశీలించారు. మహిళలతో మాట్లాడారు. వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వసుమతి బుధవారం నేలటూరులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ నాగమణి, ఈఓపీఆర్డీ హేమంత్‌కుమార్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని విజ్ఞప్తి చేశారు.
- వాయుగుండం ప్రభావంతో అర్ధరాత్రి నుంచి ఈదురుగాలులు వీస్తాయని కృష్ణపట్నం పోర్టు వర్గాలు వెల్లడించాయి. మండలంలో 80.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వరద బాధితుల తరలింపు

మనుబోలు: భారీ వర్షాలకు మండలంలోని లోతట్టు ప్రాంతాల వారిని పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. వారికి అధికారులు నిత్యావసరాలను అందజేస్తున్నారు. తీర ప్రాంత గ్రామమైన కొలనకుదురులో గిరిజన కాలనీవాసులు ఇళ్లు సక్రమంగా లేక ఇబ్బంది పడుతుండడంతో బుధవారం తుఫాన్ షెల్టర్‌కు తరలించారు. అక్కడి వారికి ఎస్సై శివరాకేష్ బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేశారు. తమలో చాలామందికి ఆధార్, రేషన్‌కార్డులు లేకపోవడంతో రేషన్ బియ్యం అందడం లేదని బాధితులు వాపోయారు. దీంతో స్పందించిన ఎస్సై వారికి కొంత నగదు అందజేశారు. ఇంకా లక్ష్మీనరసింహాపురం గ్రామంలోని గిరిజన కాలనీలో ఇళ్లు శిథిలావస్థకు చేరుకుని వర్షాలకు ఉరుస్తుండడంతో వారిని అధికారులు ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ జలజాక్షి ప్రజలకు పాలు, ఆహార పదార్థాలు అందజేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకూ భోజన వసతి ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

జలమయం

తోటపల్లిగూడూరు: మండలంలో బుధవారం భారీ వర్షం ముంచెత్తడంతో పలు లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. ముఖ్యంగా కోడూరు, వెంకన్నపాళెం తీరప్రాంత గ్రామాల వాసులు చలి తీవ్రత కారణంగా ఇబ్బంది పడ్డారు. మత్స్యకారులు ఇళ్లకే పరిమితమయ్యారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రక్రియను అధికారులు చేపట్టారు.

కల్లోలంగా కడలి

ఇందుకూరుపేట : వాయుగుండం ప్రభావంతో బుధవారం కడలి కల్లోలంగా మారింది. కెరటాలు ఎగసిపడుతున్నాయి. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నాయి. ఎడతెరిపిలేని వర్షంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు జలమయమైంది. పనులు లేకపోవడంతో వ్యవసాయ కూలీలు ఇబ్బందులు పడ్డారు. మత్స్యకారులు తమ వేట సామగ్రిని సురక్షితంగా ఉంచుకున్నారు. కాగా రెవెన్యూ యంత్రాంగం ఇప్పటికే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించారు.



మనుబోలు: బియ్యం పంపిణీ చేస్తున్న ఎస్సై



మనుబోలు: సంగమేశ్వర గిరిజన కాలనీ వాసులతో మాట్లాడుతున్న అధికారులు



పొదలకూరు: సూరాయపాళెం వద్ద రోడ్డుపై పడిన రంధ్రం

కాకాణిని కలిసిన కోవూరు నేతలు



కాకాణికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

కోవూరు : వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో కోవూరు నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షుడు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, పార్టీ బుచ్చిరెడ్డిపాళెం పట్టణ, మండలాధ్యక్షులు టంగుటూరి మల్లికార్జున్‌రెడ్డి, చర్లో సతీష్‌రెడ్డి, ఇందుకూరుపేట మండలాధ్యక్షుడు మావులూరు శ్రీనివాసులురెడ్డి, విడవలూరు మండలాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, నాయకులు కడివేటి శ్రీనివాసులురెడ్డి, కడివేటి అన్వేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



అనిల్‌కుమార్‌రెడ్డిని పరామర్శిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: మండలంలోని బసవాయపాళెనికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దువ్వూరు అనిల్‌కుమార్‌రెడ్డి సతీమణి శర్వాణి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ క్రమంలో కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బసవాయపాళెంలోని వారి నివాసానికి బుధవారం వెళ్లి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని అనిల్‌కుమార్‌రెడ్డికి భరోసా ఇచ్చారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు చిమటా శేషగిరిరావు, మందపల్లి మల్లికార్జున ఉన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

కొడవలూరు : మండలంలోని యల్లాయపాళెంలో సమాచార హక్కు చట్టంపై బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి లక్ష్మి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రజలకు వరం లాంటిదని తెలిపారు. ఈ చట్టం 2005 నుంచి అమల్లోకి వచ్చిందని, దీని ద్వారా ఏ అధికారిక కార్యాలయం నుంచైనా సమాచారం పొందే హక్కు కలిగి ఉంటామన్నారు. అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడం, అవినీతిని అరికట్టడం ఈ చట్టం ప్రధాన ఉద్దేశమన్నారు. దీనిని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యల్లాయపాళెం పశువైద్యాధికారి సురేష్‌బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపీడీఓను కలిసిన వైస్ ఎంపీపీ



ఎంపీడీఓను సన్మానించిన వైస్ ఎంపీపీ, నేతలు

పొదలకూరు: మండల ఎంపీడీఓ డీవీ నరసింహారావును వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువ కప్పి సన్మానించారు. అభివృద్ధి పనుల విషయంలో తమ వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కేతు రామిరెడ్డి, గుంటి శ్రీనివాసులు, మెంతెం బాలకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు నలగర్ల పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



ఘటనా స్థలంలో బస్సు, ట్రక్ ఆటో

మనుబోలు: మండల పరిధిలోని కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. జాతీయ రహదారిపై నెల్లూరు నుంచి గూడూరు వెళ్లే మార్గంలో కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు సమీపంలో లారీ మరమ్మతులకు గురై ఆగిపోయింది. దీంతో పోలీసులు అటు వెళ్లే వాహనాలను గూడూరు నుంచి నెల్లూరు మార్గం వైపు మళ్లించారు. ఈ నేపథ్యంలో గూడూరు నుంచి నెల్లూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు నెల్లూరు నుంచి పలమనేరు వెళ్తున్న ట్రక్ ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ ఉప్పునేని శ్రీనాథ్‌కు తీవ్రగాయాలై కేబిన్‌లో ఇరుక్కుపోవడంతో నరకయాతన అనుభవించాడు. స్థానికులు అతి కష్టం మీద అతడిని బయటకు తీశారు. చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి



కొడవలూరు: మాట్లాడుతున్న ఏఓ లక్ష్మి

కొడవలూరు : వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ లక్ష్మి కోరారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని యల్లాయపాళెంలో బుధవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలో రైతులు విరివిగా వేసే బీపీటీ 5204, కేఎన్‌ఎం 1638 వరి విత్తనాలు అన్ని ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. యల్లాయపాళెం పశువైద్యాధికారి సురేష్‌బాబు మాట్లాడుతూ మినీ గోకులాలు, పశువులకు వ్యాక్సినేషన్, పశువుల దాణా పథకాల గురించి వివరించారు. ఈ సమావేశంలో వీఏఏలు జి.ఉమామహేష్, ఒ.సుజిత్, రైతులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

విడవలూరు : భారీగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని రైతులు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల ఏఓ పి.వెంకట కృష్ణయ్య తెలిపారు. మండలంలోని విడవలూరు-2, పార్లపల్లి గ్రామాల్లో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీపీటీ-5204, కేఎన్‌ఎం-1638 అందుబాటులో ఉన్నాయని, రైతులు స్థానిక రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

ప్రశాంతమ్మా.. ఇది తగునా?

- అభ్యంతరాలున్న చోటే మద్యం దుకాణం
- మహిళలకు ఇచ్చిన హామీ ఏమైనట్లు?
- అధికార పార్టీ నేతల నిర్వాకం



ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న పెళ్లకూరు కాలనీ మహిళలు (ఫైల్)

కోవూరు : నివాసాల మధ్యనున్న మద్యం దుకాణంపై స్థానికుల్లో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఆ దుకాణాన్ని తొలగించాలని స్థానికులు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి మొర పెట్టుకున్నారు. మద్యం దుకాణాన్ని విధిగా తొలగిస్తామని స్థానికులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. మరో చోటుకు మార్పు చేసేలా చూస్తామని భరోసా ఇచ్చారు. కానీ ప్రయివేటు మద్యం దుకాణాలు బుధవారం నుంచి మొదలయ్యాయి. ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు చేసి అక్కడే దుకాణాన్ని ఏర్పాటు చేశారు. పైగా ఈ షాపు అధికార పార్టీ నాయకులదే కావడం గమనార్హం. ఇదీ కోవూరు పట్టణంలోని పెళ్లకూరు కాలనీ వద్దున్న మద్యం దుకాణం పరిస్థితి. ఇక్కడి మద్యం దుకాణం పెళ్లకూరు కాలనీలోకి వెళ్లే మెయిన్ వీధికి ఆనుకుని ఏర్పాటు చేశారు. దీనికి ఎదురుగా శాంతినగర్ ప్రధాన వీధి ఉంది. ఇక్కడ గుర్తింపు పొందిన పాఠశాల కూడా ఉంది. ఈ దుకాణంలో మద్యం కొనుగోలు చేసిన వారు పెళ్లకూరు కాలనీ వీధిలో చేరి మద్యం సేవిస్తుండడంతో ఆ వీధిలో మహిళలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రాత్రి వరకు కూడా ఆ వీధిలో వెళ్లలేక ఎంతో దూరం వెళ్లి మరో వీధి గుండా నివాసాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ బాధలు భరించలేక స్థానిక మహిళలంతా ఏకమై కోవూరు పంచాయతీ కార్యాలయంలో ఓ అధికారిక కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి వినతిపత్రం ఇచ్చి మొర పెట్టుకున్నారు. మహిళల సమస్యను విన్న ఎమ్మెల్యే అక్టోబరు మాసంలో మరో చోటకు మార్చేలా చర్యలు తీసుకొంటానని హామీ ఇచ్చారు.

పాఠశాల యాజమాన్యం ఫిర్యాదు

శాంతినగర్‌లోని ప్రైవేటు పాఠశాల కరెస్పాండెంట్ రాధికారెడ్డి కూడా ఇక్కడి మద్యం దుకాణంపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. మద్యం దుకాణం వల్ల పాఠశాలకు విద్యార్థులను తీసుకొచ్చే తల్లిదండ్రులు, విద్యార్థినులు మందు బాబుల ఆగడాలతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, మద్యం దుకాణం తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కూడా ఎమ్మెల్యే పైవిధంగానే హామీ ఇచ్చి నిశ్చింతగా ఉండాలని భరోసా ఇచ్చారు.

టీడీపీ నేతలే పట్టించుకోలేదు

ఇక్కడి మద్యం దుకాణం స్థానిక టీడీపీ నేతల సిండికేట్‌కు దక్కింది. ఈ మద్యం దుకాణంపై అభ్యంతరాలున్నాయని, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తొలగించాలని ఆదేశించి ఉందని సిండికేట్‌లోని టీడీపీ నేతలందరికీ తెలుసు. కానీ ఇవేమీ ఖాతరు చేయకుండా యథాస్థానంలోనే బుధవారం నుంచి మద్యం దుకాణం తెరిచి విక్రయాలు ప్రారంభించారు. ఎమ్మెల్యే హామీతో స్థానికులు సంతోషంగా ఉన్నారు. కానీ అక్కడే మద్యం దుకాణం తెరవడంతో ఖంగుతిన్న ఫిర్యాదుదారులు మరోసారి ఎమ్మెల్యేను కలసి ప్రశాంతమ్మా.. ఇదేంటమ్మా అని అడగాలని సిద్ధమవుతున్నారు. సొంత పార్టీ నేతలే ఎమ్మెల్యే ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారంటే ఎమ్మెల్యే మాట పట్ల ఆ పార్టీ నేతల్లో ఉన్న గౌరవం ఏమిటో తేటతెల్లమవుతోంది.



దుకాణం పక్క వీధిలో రోడ్డుపైనే మద్యం తాగుతున్న మందుబాబులు



జనావాసాల మధ్య కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం షాపు